పెండింగ్ పనులు పూర్తి చేయాలి

■ బెల్లంపల్లి తాజా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

మాట్లాడుతున్న తాజా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, డిసెంబర్ 4 : బెల్లంపల్లి నియోజకవర్గంలో తాము చేపట్టిన పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని తాజా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. సోమవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ. 5 కోట్లతో మంజూరైన స్టడీ సర్కిల్, అంబేద్కర్ భవన్, రూ. 50 లక్షలతో కళామందిర్, రూ. 50 లక్షలతో టెండర్ ప్రక్రియ దశలో ఉన్న కాంటా ఏరియాలో బస్టాండ్, ఇంటిగ్రేటేడ్ మార్కెట్‌ను పూర్తి చేయడానికి రూ. 3 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. రూ. ఐదు కోట్లతో పోచమ్మ చెరువు మినీ ట్యాంక్ బండ్, రూ. 5 కోట్లతో పార్కు పనులు ప్రారంభించాలని వెల్లడించారు. 350 ఎకరాల్లో నిర్మిస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌ను కూడా పూర్తి చేసి పలు కంపెనీలను తీసుకువచ్చి ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి కల్పించాలని సూచించారు. గత పదేండ్లలో కేసీఆర్, కేటీఆర్ ఆశీస్సులు, నియోజకవర్గ ప్రజల దీవెనలు, సహకరించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోనికి తీసుకెళ్లానని గుర్తు చేశారు. 2014 నుంచి ప్రజల అండదండలతో అభివృద్ధికి బాటలు వేశానని తెలిపారు. మూడోసారి టికెట్ రాకుండా కొంతమంది నాయకులు నీచరాజకీయాలకు పాల్పడిన కేసీఆర్, కేటీఆర్ తనను గుర్తించి టికెట్ కేటాయించారని పేర్కొన్నారు. డబ్బు, మద్యంతో మాత్రమే వినోద్ గెలిచారని ఆరోపించారు. ఒక ప్రణాళిక బద్ధంగా వినోద్ అధర్మంగా గత ఏడాది నుంచి తనను మానసికంగా దెబ్బతీశారని విమర్శించారు. ప్రజలు నా వెంటే ఉన్నారని చెప్పారు. నైతికంగా తానే గెలిచానని వినోద్ ఓడిపోయారని స్పష్టం చేశారు. ఎస్సీ నియోజవర్గంలో తనను ఓడించడానికి రూ. 100 కోట్లు ఖర్చు పెట్టడమే దీనికి నిదర్శనమన్నారు. ప్రజా తీర్పుకు తాను శిరస్సు వహిస్తానని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పటిలాగే 24 గంటలు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. అధికారంలో ఉండగా ఏ ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తల జోలికి వెళ్ల లేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ గెలిచి కొన్ని గంటలు కాకముందే బెల్లంపల్లి మండలంలోని పెరకపల్లి సర్పంచ్ భార్య బూదకలాన్‌లో ఎంపీటీసీ, మెట్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకుడిపై దాడులు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు కూడా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఓపిక పడుతున్నారని వారు తిరగబడితే ఎవరూ ఆపలేరని హెచ్చరించారు. ఈ దాడులకు ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు హుందాగా వ్యవహరించాలని సూచించారు. పార్టీ ఓడిపోవడంతో నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహ పడకుండా మనోధైర్యం పెంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డం వినోద్‌కు శుభాకాంక్షలతో పాటు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మాజీమంత్రి కేటీఆర్‌ను కలిసిన కొమ్రెవార్

మాజీ మంత్రి కేటీఆర్‌తో డాక్టర్ కొమ్రెవార్

భైంసా, డిసెంబర్ 4 : మాజీమంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను ముథోల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు డా. కిరణ్ కొమ్రెవార్ హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

రిపబ్లిక్ ఆఫ్ ఎస్టోనియా భారత రాయబారితో

బాసర ఆర్జీయూకేటీ భేటీ

రిపబ్లిక్ ఆఫ్ ఎస్టోనియా భారత రాయబారితో వీసీ వెంకటరమణ

బాసర, డిసెంబర్ 4 : నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ సోమవారం హైదరాబాద్‌లోని ఐటీ హబ్‌లో రిపబ్లిక్ ఆఫ్ ఎస్టోనియా భారత రాయబారి అజనీశ్‌కుమార్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా ఎస్టోనిక్ విశ్వ విద్యాలయాలు, ఆర్జీయూకేటీ బాసర సంయుక్తంగా పరిశోధన, ఉపాధి అవకాశాలపై చర్చించినట్లుగా తెలిపారు. అనంతరం ఎస్టోనియా యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు చర్చలు జరిపినట్లుగా ఆయన తెలిపారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

మాట్లాడుతున్న నిర్మల్ డీఈవో రవీందర్ రెడ్డి

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 4 : యూడైస్ ప్లస్‌లో విద్యార్థుల వివరాలు పక్కగా నమోదు చేయాలని నిర్మల్ డీఈవో రవీందర్ రెడ్డి సూచించారు. సోమవారం నిర్మల్ జిల్లాలోని అన్ని మండలాల ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్‌లు, సీసీవోలు, సీఆర్పీలు, ఉపాధ్యాయులకు స్థానిక పంచశీల్ కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి యూడైస్ ప్లస్‌లో పాఠశాలల సమగ్ర వివరాలు, విద్యార్థుల వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాలను విజయవంత చేయాలన్నారు. కార్యక్రమంలో పరీక్షల సహాయ కమిషర్ సిద్ధ పద్మ, ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజేశ్వర్, లింబాద్రి, ఎంఈవోలు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

ఆదిలాబాద్ డీఈవో ప్రణీతకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న పీజీ హెచ్ఎం కృష్ణకుమారి

తాంసి(తలమడుగు), డిసెంబర్ 4 : విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత అన్నారు. సోమవారం ఖోడద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అధికారులతో కలిసి సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను పరిశీలించారు. ముందుగా డీఈవోను విద్యార్థులు తయారు చేసిన పుష్పగుచ్చాలతో ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థుల కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్కూల్ గార్డెన్, బండి తోటలో పండించిన కూరగాయలు ఆకుకూరలను చూసి హెచ్ఎంను ప్రశంసించారు. కార్యక్రమంలో పర్యవేక్షణ బృందం సుజాత్‌ఖాన్, సెక్టోరియల్ అధికారి నారాయణ, ఏఎంవో శ్రీకాంత్ గౌడ్, సంతోష్ కుమార్, ప్రతాప్, ఉపాధ్యాయులు సుకుమార్ పెట్కులే, మమత, వాసుదేవ్, సురేఖ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు.

దండేపల్లి, డిసెంబర్ 4 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గ్రామంలోని రమాసహిత ఆలయంలో కార్తీక సందడి కొనసాగుతుంది. ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అనంతరం గుట్ట కింద భాగంలో రావిచెట్టు కింద, గుట్ట పైన గల ధ్వజస్థంభం వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 247 మంది సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. వ్రతాల కొరకు ప్రత్యేకంగా రెండు వ్రత మండపాలను ఏర్పాటు చేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో సత్తాచాటిన ఆదర్శ విద్యార్థులు

ఆసిఫాబాద్, డిసెంబర్ 4 : ఆసిఫాబాద్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఇటీవల వరంగల్ లో తెలంగాణ రాష్ట్ర 7 బ్లాక్ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన ఆర్ షణ్ముఖ తేజ, వీ మోక్షిత్ సాయి, ఎండీ మాజ్, రోహిత్, రోహన్, ఎండీ టౌఫిక్, ఎం కార్తీక్, సిద్ధు , ఏ అభిలాష్ , ఎన్ నందకిశోర్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, పీడీ బీ తిరుపతి, ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్, కమిటీ సభ్యులు అభినందించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

స్థానికంగా ఉండి విధులు నిర్వహించాలి

వైద్య ఉద్యోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

జైనూర్, డిసెంబర్ 4: వైద్యాధికారులు, వైద్య ఉద్యోగులు స్థానికంగా ఉండి విధులు నిర్వహించాలని ఆసిఫాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ సూచించారు. సోమవారం జైనూర్‌లోని ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రక్త పరీక్షల ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. రోగుల వార్డులను సందర్శించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందే విధంగా చూడాలని విధుల్లో నిర్లక్ష్యం చేయకూడదని వైద్యాధికారులు, వైద్య ఉద్యోగులకు సూచించారు. ఆయన వెంట వైద్యాధికారులు జితేందర్ రెడ్డి, అశోక్, మలేరియా శాఖ సబ్ యూనిట్ అధికారి గణేశ్ జాదవ్, హెచ్ఈవోలు రమేశ్ జాదవ్, దిలీప్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు ఉన్నారు.